క్లుప్తంగా

కాళికాంబకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజల అనంతరం పలు రకాల పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆడుదాం ఆంధ్రతో క్రీడాకారుల్లో ఉత్సాహం


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొందని ఎంపీడీఓ అనసూయ తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రభుత్వం అందించిన మెడల్స్, ప్రశంస పత్రాలు, షీల్డ్‌లను అందజేశారు. ఎంఈఓ అబ్దుల్ కరీం, ఏపీఓ నాగజ్యోతి, పంచాయితీ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

అమ్మ ఒడి పేద విద్యార్థులకు వరం

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ట్యాబ్‌లు, అమ్మఒడి వంటి పథకాల ద్వారా చేయూత అందిస్తోందని రాష్ట్ర ఐఈ కోఆర్డినేటర్ రాధిక తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో మానసిక దివ్యాంగ విద్యార్థుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల జీవన ప్రమాణాల పెరుగుదల, శారీరక ధృఢత్వాన్ని పెంచేందుకు ఫిజియోథెరపీ ద్వారా ఏ మేరకు సేవలు అందుతున్నాయో ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఐఈ జిల్లా కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

గోస్పాడు:తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల పోస్టల్ సభ్యులు అధికారి సత్యనారాయణరావు కోరారు. మండలంలోని పసరపాడు, గోస్పాడు, జూలేపల్లె గ్రామాల్లో తపాలా శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పనుల పరిశీలన

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామంలో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు సర్పంచ్ సంజీవరాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పత్తి నారాయణ తెలిపారు. శుక్రవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, ఉపాధిహామీ పథకం నుంచి రూ.5 లక్షల వెచ్చించి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మిస్తున్నామని చెప్పారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్ తెలిపారు. మండల కేంద్రంలోని సీపీడబ్ల్యూఎస్ స్కీంను శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కిరణ్ బాబుతో కలిసి పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ వేసవి ప్రారంభం కానున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. ముందు జాగ్రత్తగా ట్యాంకును నీటితో నింపుకోవాలని చెప్పారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మద్యం మత్తులో ఇరువర్గాల మధ్యన ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సురేష్, శ్యామల మరో వర్గాని చెందిన సుధాకర్, రాణి అనే ఇరువర్గాలు శుక్రవారం గొడవపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

లక్ష సంకీర్తనకు సహకరించండి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ఇస్కాన్ హరేకృష్ణ ధర్మప్రచారం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష సంకీర్తన కార్యక్రమంలో భాగంగా లక్ష పుస్తకాల పంపిణీకి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీనియర్ న్యాయవాది రామచంద్రారావు కోరారు. శుక్రవారం తనవంతు సాయంగా రూ.10వేల విలువజేసే రూ.250 పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రచార సమితి సభ్యులు మంగళ గోప్‌దాస్, అశోకదాస్ పాల్గొన్నారు.

ఇక చింతలేని సంత

- రూ.25 లక్షలతో సంత మార్కెట్ నిర్మాణం
- ఇటీవల ప్రారంభించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, వినియోగదారులు



దొర్నిపాడు: మొన్నటి వరకు చినుకు పడితే చిత్తడే. బురదలో కూరగాయాల క్రయ,విక్రయాలకు వ్యాపారులు, వినియోగదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి చినుకులు రాలినా బురదమయమయ్యేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దొర్నిపాడు కూరగాయల సంతమార్కెట్‌ను ఆధునీకరించడానికి చర్యలు చేపట్టింది. ఇందుకు రూ.25లక్షలు కేటాయించింది. సంతమార్కెట్‌ను శ్రీపరమేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించి వసతులు ఏర్పాటు చేశారు. దీంతో వ్యాపారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంగళవారం రద్దీగా..

దొర్నిపాడులోని కూరగాయల సంత మార్కెట్ ప్రతి మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వినియోగదారులతో రద్దీగా మారుతుంది. అయితే గతంలో అక్కడ సరైన వసతులు లేకపోవడంతో


నేడు-రాత్రివేళల్లో విద్యుత్ దీపాల వెలుగులో సంతమార్కెట్

వ్యాపారులు కిందనే కూర్చొని వ్యాపారాలు సాగించేవారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వినియోగదారులు గత్యంతరం లేక కొనుగోళ్లు సాగించేవారు. ఇక వర్షాకాలంలో పరిసరాల్లోని వర్షపు నీరంతా మార్కెట్‌లోకి చేరి నీరి నిల్వ చేరేది. అలాగే.. రోజుల తరబడి బురదతో నిండిపోయేది. కుళ్లిన కూరగాయలతో దుర్వాసన వెదజల్లేది. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మార్పులు చేపట్టడానికి సంకల్పించింది. ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చొరవతో రూ.15 లక్షలు నాబార్డు, రూ.10 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో సంతమార్కెట్‌ను ఆధునీకరించారు. వసతులు సమకూరడంతో వ్యాపారులు, కొనుగోలుదారులకు అవస్థలు తప్పాయి.

రెండు షెడ్లు...మరిన్ని వసతులు

వ్యాపారుల వసతి కోసం రెండు రేకుల షెడ్లు, ఆఫీస్ రూం, స్త్రీ పురుషుల కోసం విడివిడిగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అలాగే గుంతలను పూడ్చి ప్రహరీ నిర్మించి నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో చీకటి పడినా వ్యాపారాల నిర్వహణకు ఇబ్బందులు తప్పాయి. గతంలో మరుగుదొడ్లు లేక మహిళలు చాలా ఇబ్బందులు పడేవారు.



దొర్నిపాడులోని నూతన కూరగాయల సంతమార్కెట్


నాడు- అధ్వానంగా సంతమార్కెట్

చాలా ఇబ్బందులు పడ్డాం



సంతమార్కెట్లో గతంలో సరైన వసతులు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం రేకుల షెడ్లు నిర్మించారు. ఆవరణను తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో చీకటి పడినా వ్యాపారానికి ఇబ్బందులు లేవు. రాత్రి అయినప్పటికీ పగలు మాదిరిగానే ఉంది. మార్కెట్‌ను బాగు చేసినందుకు ఆనందంగా ఉంది.

–బాషా, కూరగాయల వ్యాపారి

వసతులు కల్పించాం



సంత మార్కెట్‌లో సరైన వసతులు లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడేవారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చొరవతో నాబార్డు, గ్రామ పంచాయతీ నిధులతో ఆధునీకరించాం. ప్రస్తుతం వర్షాలు కురిసినా ఇబ్బందులు ఉండవు. ముఖ్యంగా సంతమార్కెట్ కమిటీ సహకారం మరువలేనిది.

– నాగార్జున, గ్రామ పంచాయతీ కార్యదర్శి, దొర్నిపాడు

వాసవీ మాతకు క్షీరాభిషేకం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ మహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారికి క్షీరాభిషేకంనిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ మూర్తికి ఆవుపాలతో అభిషేకం చేపట్టారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు,మహిళా మండలి అధ్యక్షురాలు తాడువాయి ఇందుమతి మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దోమలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలో దోమల తీవ్రత పెరిగినందున వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పారిశుద్ధ్య పనులను రోజూ పర్యవేక్షిస్తూ పట్టణాభివృద్ధి కృషి చేస్తున్నామన్నారు. శుక్రవారం స్థానిక 34వ వార్డులో ఫాగింగ్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రోజూ షెడ్యూల్ వారీగా కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామని చెప్పారు. అలాగే పిచ్చి మొక్కలను తొలగిస్తూ, ఫాగింగ్ చేస్తూ కల్వర్టుల వద్ద ప్రత్యేకంగా స్ప్రే, ఫాగింగ్ చేయాలని చెప్పారు. డీఈఈ మధుకుమార్, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న జడ్జి రాధారాణి

నంద్యాల(వ్యవసాయం): సమాజంలో వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి కోరారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో అధికారులు, ఎన్‌జీఓ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటుకబట్టీల్లో పని చేసే మహిళలకు సరైన వేతనాలు, వసతులు, బాత్‌రూములు కల్పిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నీసా, మున్సిపల్ అధికారులు లక్ష్మీనారాయణ, మురళీకృష్ణ, విద్యావతి, రెవెన్యూ అధికారులు, లీగల్ సెల్ రామచంద్రారావు, భాస్కర్ పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): ప్రజల్లో సమైఖ్యతా భావాన్ని పెంపొందించి, అందరూ సమానమనే సమైఖ్యతా వాదాన్ని చాటి చెప్పేలా వెట్టి చాకిరీని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బషీరున్నిసా బేగం అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వెట్టి చాకిరి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు శాఖ అధికారులు, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం


బాలికకు మాత్రలు ఇస్తున్న కాంతారావు నాయక్

నంద్యాల టౌన్: రక్తహీనత, అనారోగ్యాన్ని కలిగించే నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నిర్మూలించడంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,11,270 మందికి అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందించనున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి, వై ఎస్సార్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రమ్యకృష్ణ, డిప్యూటీ ఎడుకటివనల్ ఆఫీసర్ మహబూబ్ భేగ్, శివరాం, డీసీఎం చిన్న వీరన్న పాల్గొన్నారు.

రుద్రవరం: ఆల్బెండజోల్ మాత్రలతో చిన్నారుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని నర్సాపురం,ఆలమూరు పీహెచ్‌సీ వైద్యులు బాబు,ఆమర్నాథరెడ్డి, గాయిత్రి తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారు అయా గ్రామాల్లోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. అనంతరం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు.

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం జరిగింది. శిరివెళ్ల, యర్రగుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మందులు వేశారు. శిరివెళ్ల పీహెచ్‌సీపీ పరిధిలో 5,015 మందికి, యర్రగుంట్లలో 6,555 మంది చిన్నారులకు డాక్టర్లు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. డాక్టర్లు భవ్య, ముఖేష్ కుమార్, శ్రీ భవ్యశ్రీ, సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో 1-5 సంవత్సరాల్లోపు చిన్నారులకు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత, మోడల్‌స్కూళ్లలో 6-19 సంవత్సరాల్లోపు 1,980 విద్యార్థులకుగాను 1,824 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, అపర్ణ, రాబర్ట్ కెనడీ, శివలింగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు రామచంద్రుడు, దస్తగిరి పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా


ఆర్.జంబులదిన్నెలో వృద్ధుడిని పరీక్షిస్తున్న డాక్టర్


కానాలలో వృద్ధుడికి ఈసీజీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలందరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని ఎంపీడీఓ రఘురాం, ఎంపీటీసీ సభ్యులు సత్తిగారి బాలిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ సచివాలయంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చంద్రశేఖర్, కిశోర్‌రెడ్డి, విజయదుర్గ, రమేష్ ప్రజలకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో 462 మందికి వైద్య పరీక్షలు, 58 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.సర్పంచ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి విజయదీప్తి పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలోని గుండపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ ఫేజ్ వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. నంద్యాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు క్రాంతి, కిరణ్, శ్రీకాంత్, కంటి వైద్య నిపుణుడు కృష్ణమోహన్‌రెడ్డి 511 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ డాక్టర్లు వెంకటరెడ్డి, దినేష్‌రెడ్డి, నాయకులు రేవనూరు రామాంజనేయరెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పేరుతో పల్లెలో నిపుణులైన వైద్యులతో ప్రత్యే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందిస్తోందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో సర్పంచ్ పద్మిని అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు భార్గవి, రాజశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి 356 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ మోహన్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): కానాల గ్రామం సచివాలయం -1 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నలుగురు స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది దాదాపు 531మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ బావమ్మ, పీఎస్ నరేంద్ర వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

నంద్యాల టౌన్ : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించాలని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర రావు తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవల్లో భాగంగ శుక్రవారం పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ-జాగ్రత్త అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, స్టేషన్ మేనేజర్ తిమ్మయ్య, డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

శిరివెళ్ల: మండల కేంద్రం మజరా కాదరబాదర గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం మాట్లాడుతు గ్రామ పంచాయతీ, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షలతో రోడ్డు వేస్తున్నామన్నారు. నీటి సమస్య రాకుండా ఆనకట్టను నీటితో నింపామన్నారు.జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, రిటైర్డ్ ఏంఈఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

అన్నదానం

గోస్పాడు: యాళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మహిళా వి భాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ సహకారంతో శుక్రవారం అన్నదానం చేశారు. డాక్టర్లు మాధవి, రాజేష్ శివా ని,ప్రశాంత్‌శ్రీనివాసులు,ప్రియదర్శిని పాల్గొన్నారు.

యోగా గురువు విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్ఫటిక లింగేశ్వర ఆలయంలో యోగా గురువు అచల పరిపూర్ణ యోగానంద పాములేటి స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వేడుకగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి జలాదివాసం, ధాన్యాది వాసం, యంత్ర ప్రతిష్ఠ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఇందుకు ప్రత్యేక అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమావాస్యను పురస్కరించుకొని హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

నంద్యాల(అర్బన్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రూ.3.60 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి చేపట్టనున్నారు. సీఆర్‌ఆర్ నిధుల కింద రూ.2.05 కోట్ల సీఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్డు, మిట్నాల-బి.శివరాంపురం వరకు రూ.1.25 కోట్లతో బీటీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపనలు, మిట్నాలలో రూ.17.67 లక్షలతో బల్క్‌మిల్క్ కేంద్రం, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్ఎస్ఏ నిధుల కింద ఏపీ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను ప్రారంభించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీ2 ఏఈ రామయ్య శుక్రవారం తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ స్తంభాల పరిశీలనలో భాగంగా పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, టెక్కె, నూనెపల్లె, నర్స్ క్వార్టర్స్, టీచర్స్ కాలనీ, నౌమాన్ నగర్, గిరినాథ్ సెంటర్, విశ్వనగర్, భరతమాత గుడి వీధి తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంప్రదాయ నృత్యంపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు సంప్రదాయ నృత్య అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శుక్రవారం విద్యార్థులకు సంప్రదాయ నృత్యంపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ శైలజ, రామలింగారెడ్డి, శిరోమణి, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు. అలాగే పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు

సంక్షిప్తం

కుళాయి కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

శిరివెళ్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ వాసులు నీటి కుళాయి కనెక్షన్‌కు దరఖాస్తును కార్యాలయంలో అందజేయాలని పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఈఓఆర్డీ నాగేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతు కనెక్షన్ పొందేందుకు రూ. 5,100 డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇందుకు మధ్య దళారులు, రాజకీయ పార్టీకు సంబంధం లేదన్నారు. కనెక్షన్ అవసరమైన వారు కార్యాలయంలో మాత్రమే సంప్రదించాలని చెప్పారు.

రేపు ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు ఒడిత్య శంకర్‌నాయక్ ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నంద్యాల జిల్లాలో పర్యటిస్తారని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ శంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న పట్టణ శివారులోని నందమూరినగర్ ఎస్టీ కాలనీ గిరిజనులతో సమావేశం నిర్వహిస్తారని, 12న కోవెలకుంట్ల, 13న బేతంచెర్ల మండలాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా జొన్నల కొనుగోలు

శిరివెళ్ల: రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న కొనుగోలు చేస్తున్నారని ఎంపీపీ నాయక్ వసీం తెలిపా రు. శుక్రవారం వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని జొన్నలు క్వింటా రూ. 3,180 ప్రకారం చెల్లింస్తుందని రైతుల నుంచి ఇప్పటికే 2,500 క్వింటాళ్లు కొనుగోలు చేశారన్నారు ఏఓ సుధాకర్, వెటర్నరీ డాక్టర్ దస్తగిరి పాల్గొన్నారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి

నంద్యాల(సిటీ): నైట్ షెల్టర్ నిర్వహకులు నిరాశ్రయులను ఆదుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నైట్ షెల్టర్‌ను పరిశీలించి, వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

విధుల్లో అలసత్వం వీడాలి

మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక 2వ వార్డు, 36వ వార్డు రామనాథరెడ్డి నగర్ వార్డు సచివాలయాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల నంద్యాల జిల్లా కార్యదర్శి రమణకుమారి కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ కనీస వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

అంధ విద్యార్థులకు పండ్లు పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సెయింట్ లూక్స్ అంధుల పాఠశాల విద్యార్థులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు విజయరావు, జిల్లా అధ్యక్షుడు భాస్కరరెడ్డి, కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీఎస్పీ రవీంద్రారెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారులు డీఎస్పీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐలు రవిశంకర్‌నాయక్, తిమ్మరాజునాయుడు, ట్రాఫిక్ సీఐ ఇస్మాయిల్ బాషా, కౌన్సిలర్ తమీమ్, రెడ్‌క్రాస్ ప్రతినిధి దస్తగిరి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


మాట్లాడుతున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

చాగలమర్రి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎస్ఐ రమణయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక రాయల్ కేఫ్ సమీపంలోనున్న మైదానంలో ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రం షబ్బీర్ అహ్మద్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీతో కలిసి ప్రారంభించారు. టోర్నమెట్ నిర్వాహకులు సలీం, తాహీర్, వాజిద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 20 జట్లు పాల్గొంటాయన్నారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3,500, రూ.3వేలు అందజేస్తామని చెప్పారు.

వేడుకగా జయంత్యుత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): కల్పన సెంటర్‌లో వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో శుక్రవారం కాశినాయన జయంత్యుత్సవాలను వేడుకగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, స్నపన తిరుమంజన సేవ అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు విష్ణుసహస్ర నామ సోత్రాలు, అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, వేదపండితుడు సుబ్బశాస్త్రి, శేషు, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

మోటార్ల కేబుల్ చోరీ

చాగలమర్రి: స్థానిక బుగ్గ మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోనున్న సుమారు పది మంది రైతుల పొలాల్లోనున్న సబ్‌మెర్సిబుల్ మోటార్ల కేబుళ్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుందని బాధిత రైతులు ముల్లా షేక్షావలి, గేట్ల మాబు, ఎం.ఫయాజ్, జనార్దన్, రామదాసు, గుంటూరు శ్రీను, ముచ్చేర్ల కృష్ణ తదితరులు శుక్రవారం తెలిపారు. పొలాల్లో సబ్‌మెర్సిబుల్ మోటారు నుంచి స్టార్టర్‌కు మధ్య ఉన్న కేబుల్‌ను కత్తిరించి షేక్షావలి అనే రైతు పొలంలో కాల్చి అందులో ఉన్న రాగి తీగను తీసుకెళ్లారని చెప్పారు. విషయాన్ని పోలీసుల దృష్టి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.